ట్రంప్ టారిఫ్ బెదిరింపులకు

తలొగ్గిన మోదీ సర్కారు!

- దిగుమతులపై సుంకాలు తగ్గించేందుకు యోచన
- రేపో మాపో కేంద్రం ప్రకటన
- ముంచుకొస్తున్న ఏప్రిల్ 2 గడువు

న్యూఢిల్లీ, మార్చి 25: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలకు మోదీ ప్రభుత్వం తలొగ్గింది! అమెరికా దిగుమతులపై సుంకాలను తగ్గించేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ప్రతీకార సుంకాలపై అమెరికా అధ్యక్షుడు విధించిన ఏప్రిల్ 2 గడువు సమీపిస్తుండడంతో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమెరికా దిగుమతులలో సగానికి పైగా వస్తువులపై సుంకాన్ని తగ్గించాలని యోచిస్తోంది. అమెరికా దిగుమతులలో సగం అంటే దాదాపు రూ.1.97 లక్షల కోట్ల (23 బిలియన్ డాలర్లు) విలువైన దిగుమతి సుంకాలపై కోత విధించాలని మోదీ ప్రభుత్వం యోచిస్తోంది. అమెరికాకు జరిగే రూ.5.65 లక్షల డాలర్ల (66 బిలియన్ డాలర్లు) ఎగుమతులను రక్షించుకోవాలని ఉద్దేశంతో కేంద్రం ఈ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. అమెరికా ప్రకటించిన ప్రతీకార సుంకాల హెచ్చరిక దాని మిత్రదేశాలతో సహా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది. అమెరికా విధించనున్న ప్రతీకార సుంకాలు 87 శాతం భారతీయ ఎగుమతులపై ప్రభావితం చూపుతాయని భారత ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రభావాన్ని తగ్గించుకోవడానికి 55 శాతం అమెరికా దిగుమతులపై సుంకం తగ్గించాలని మోదీ ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం అమెరికా దిగుమతులపై భారత్ 5 శాతం నుంచి 30 శాతం వరకు సుంకాలు విధిస్తోంది. కొన్ని సుంకాలను తగ్గించి, మరి కొన్నిటిపై పూర్తిగా సుంకాలు తొలగించాలని ప్రభుత్వం భావిస్తోంది. కొన్ని ఎంపిక చేసిన వస్తువులపై సుంకాలు తగ్గించే విషయం కూడా పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. మంగళవారం నుంచి వాణిజ్య చర్చలు ప్రారంభం అవుతున్నాయి.

ఏ వస్తువులపై సుంకాల కోత?

అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులలో సగం వస్తువులపై సుంకాలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. వీటిలో ఆల్మండ్లు, ఓట్‌మీల్, పిస్తా పప్పు, క్వినోవా ఉండనున్నాయి. అయితే మాంసం, మొక్కజొన్న, గోధుమలు, పాడి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించబోమని భారత్ ఇదివరకే స్పష్టం చేసింది. ప్రస్తుతం ఆటోమొబైల్స్‌పై 100 శాతం దాటిన సుంకాలను గణనీయంగా తగ్గించనుంది. అమెరికా ప్రతీకార సుంకాల వల్ల ఫార్మా, ఆటోమొబైల్స్‌తో సహా అనేక రంగాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని భావిస్తున్నారు.

సోషల్ ఖాతాల వివరాలు వెల్లడించాల్సిందే

- అమెరికా గ్రీన్‌కార్డుదారుల్లో పెరుగుతున్న గుబులు
- ట్రంప్ తాజా ప్రతిపాదనతో ఇబ్బందులు తప్పవని ఆందోళన

వాషింగ్టన్, మార్చి 25: అక్రమ వలసదారుల అణచివేత విధానంలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌కార్డుదారులను కూడా వదలడం లేదు. గ్రీన్‌కార్డు కలిగి శాశ్వత నివాసం, ఆశ్రయం కోసం దరఖాస్తు చేసే వారికి భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పేలా లేదు. ట్రంప్ తాజా ప్రతిపాదనలో భాగంగా, అమెరికాలో గ్రీన్‌కార్డు ఉన్న పౌరులు త్వరలోనే తమ సోషల్ మీడియా ఖాతాలను ప్రభుత్వానికి తెలియజేయవలసి ఉంటుంది. ఇతర దేశాల్లో ఉంటున్న వీసా దరఖాస్తు దారులు ఇప్పటికే తమ సామాజిక మాధ్యమ ఖాతాలను యూఎస్ సిటిజన్‌షిప్, ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్)కు తప్పనిసరిగా అప్పగించాలన్న నిబంధన తెచ్చారు. ఇప్పుడు ఆ నిబంధన ప్రస్తుతం గ్రీన్‌కార్డు పౌరులకు కూడా విస్తరించారు. వారు తమ సామాజిక మాధ్యమ ఖాతాల వివరాలను అప్పగించాలి. అయితే ఈ నిబంధన అమలులోకి వస్తే గ్రీన్‌కార్డు కలిగి ఉన్న చాలామందితో పాటు భారత సంతతి వ్యక్తులకు కూడా ఇబ్బందులు తప్పవన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.

ఎగుమతి.. అధోగతి!

- చరిత్రలో ఎన్నడూ చూడని కనిష్ఠాలకు ఎగుమతులు
- 1948నాటి కంటే దిగువకు పడిపోయిన దేశీయ వాటా
- బీజేపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్లే ఈ దుస్థితి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): ఎగుమతులు ఎక్కువగా ఉన్న దేశం ఆర్థికంగా పుష్టిగా ఉంటుందంటారు ఆర్థిక నిపుణులు. ఎగుమతుల విలువ పెరిగితే.. అంతర్జాతీయంగా ఆ దేశానికి పరపతి పెరుగుతుంది. దౌత్య సంబంధాలు బలపడటంతో పాటు విదేశీ కరెన్సీ నిల్వలు పెరుగుతాయి. దేశీయంగా కంపెనీల సంఖ్య పెరిగి ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయి. అయితే, ప్రధాని నరేంద్రమోదీ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి అంతర్జాతీయంగా వివిధ అంశాల్లో దేశ పరపతి పడిపోతూనే ఉన్నది. కేంద్రంలోని బీజేపీ సర్కారు అనాలోచిత నిర్ణయాలతో తాజాగా దేశీయ ఎగుమతుల విలువ చరిత్రలో చూడనటు వంటి స్థాయికి దిగజారింది.

ఎగుమతుల్లో క్షీణత 10.9 శాతం

కీలక రంగాల్లో ఎగుమతులు అంతకంతకూ పడిపోతున్నాయి. పెట్రోలియం, నేత వస్త్రాలు-దుస్తులు, సముద్ర ఉత్పత్తులు, ప్లాస్టిక్స్, రత్నాలు-ఆభరణాలు వంటి కార్మిక శక్తి అధికంగా ఉన్న రంగాలు తీవ్ర నైరాశ్యంలోకి కూరుకుపోయాయి. గత ఫిబ్రవరిలో ఆయా దేశాలకు భారత్ నుంచి జరిగిన ఎగుమతుల విలువ 36.9 బిలియన్ డాలర్లకు పడిపోయింది. నిరుడు ఇదే నెలతో పోలిస్తే ఎగుమతుల్లో క్షీణత 10.9 శాతంగా రికార్డయ్యింది. ఏడాది వ్యవధిలో దేశీయ వస్తు ఎగుమతుల విలువ 4.5 బిలియన్ డాలర్ల మేర క్షీణించినట్టు తెలుస్తోంది. 1948లో అంతర్జాతీయంగా భారత వస్తు ఎగుమతుల వాటా 2.2%గా నమోదవ్వగా.. 2025లో అంతర్జాతీయంగా భారత వస్తు ఎగుమతుల వాటా 1.6%గానే రికార్డయ్యింది. అంటే స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో దేశీయ ఎగుమతులతో పోలిస్తే.. బీజేపీ ప్రభుత్వ హయాంలో వస్తు ఎగుమతుల వాటా మరింతగా పతనమైంది.

మేకిన్ ఇండియా.. జోకిన్ ఇండియా

దేశీయ కంపెనీలను, ఉత్పత్తులను ప్రోత్సహించడానికి తద్వారా ఎగుమతులను పెంచడానికంటూ 2014 సెప్టెంబర్ 25న 'మేకిన్ ఇండియా' పేరిట బీజేపీ సర్కారు ఓ ఆర్భాటపు కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. తయారీ రంగంలో ఏటా 12-14 శాతం వృద్ధిరేటును నమోదు చేస్తామని, 2022 నాటికి జీడీపీలో తయారీ రంగం వాటాను 25 శాతానికి పెంచి 10 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఊదరగొట్టింది. అయితే, పదేండ్ల అనంతరం 'మేకిన్ ఇండియా' 'జోకిన్ ఇండియా'గా మారినట్టు గణాంకాలను బట్టి అర్థమవుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 35,567 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) మూతబడినట్టు ఇటీవల ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్రం పార్లమెంట్ వేదికగా సమాధానమిచ్చింది. 2019 జూలై నాటికి దేశవ్యాప్తంగా 6.8 లక్షల కంపెనీలు మూతబడ్డట్టు పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆ ఏడాది పేర్కొనడం తెలిసిందే. దీన్ని బట్టి రోజుకు సగటున దేశవ్యాప్తంగా 300 కంపెనీలు మూతబడుతున్నట్టు కార్మిక హక్కుల కార్యకర్తలు చెప్తున్నారు. మొత్తంగా మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన మేకిన్ ఇండియా అట్టర్‌ఫ్లాప్‌గా మారిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

దేశీయ వస్తు ఎగుమతుల విలువ

ఎగుమతుల వాటా ఇలా..

1947-48లో అంతర్జాతీయంగా భారత వస్తు ఎగుమతుల వాటా 2.2 శాతం

2024-25లో అంతర్జాతీయంగా భారత వస్తు ఎగుమతుల వాటా 1.6 శాతం

2024 ఫిబ్రవరిలో	41.4	బిలియన్ డాలర్లు
2025 ఫిబ్రవరిలో	36.9	బిలియన్ డాలర్లు
ఏడాది వ్యవధిలో పతనం	4.5	బిలియన్ డాలర్లు



- దేశ పరపతి పెరుగుతుంది.
- అంతర్జాతీయంగా ప్రాతినిధ్యం దక్కుతుంది.
- విదేశీ కరెన్సీ నిల్వలు పెరుగుతాయి.
- దేశీయంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.
- దౌత్య సంబంధాలు బలపడతాయి.

చిన్న దేశాలే బెటర్

నేత వస్త్రాలకు సంబంధించి బంగ్లాదేశ్, వియత్నాం వంటి చిన్న దేశాలు ఎగుమతుల్లో ఏటా 6 శాతానికి పైగా వృద్ధి నమోదు చేస్తుంటే, మన దగ్గర వృద్ధిరేటు ఒక్క శాతం కూడా ఉండట్లేదు. వస్త్ర పరిశ్రమకు కేంద్రం ఆశించిన స్థాయిలో ప్రోత్సాహకాలు ఇవ్వట్లేదని వ్యాపారులు చెప్తున్నారు.

ఒక్క శాతమూ దాటట్లేదు

పాదరక్షల రంగంలో ప్రపంచ వాణిజ్య విస్తరణ 5 శాతం దాకా ఉన్నది. అయితే, భారత్‌లో ఇది ఒక్క శాతం కూడా మించట్లేదు.

ఆర్థిక వ్యవస్థకు నష్టమే

కార్మిక శక్తి ఎక్కువగా ఉన్న రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించకపోతే, నిరుద్యోగం మరింతగా పెచ్చరిల్లవచ్చు. అదే జరిగితే, ఆర్థిక వ్యవస్థే అల్లకల్లోలమయ్యే ప్రమాదం ఉంది.

ఉల్లి రైతుల అరిగోస

- దిగుబడి పెరిగినా లాభం లేదు
- ఎగుమతులపై సుంకాలే కారణం
- మోదీ సర్కారుపై రైతుల ఆగ్రహం
- ఎట్టకేలకు దిగొచ్చిన కేంద్రప్రభుత్వం
- వచ్చే నెల 1 నుంచి సుంకాల ఎత్తివేత

న్యూఢిల్లీ, మార్చి 25: ఈ ఏడాది పంట దిగుబడి బాగా వచ్చింది. ధర బాగానే గిట్టుబాటవుతుందని ఆశించిన ఉల్లి రైతులకు కేంద్రం విధించిన సుంకాల ఘాటు శరాఘాతంలా తగలడంతో కన్నీళ్లు తెప్పించింది. కేంద్రం విధించిన అధిక ఎగుమతి సుంకం కారణంగా తమ పంటను విదేశాలకు ఎగుమతి చేయలేక ఉసూరుమంటున్నారు. దీంతో మోదీ ప్రభుత్వంపై వారు తీవ్ర ఆగ్రహంతో గత నెల రోజులుగా తీవ్ర ఆందోళన చేపట్టారు. దీంతో దిగివచ్చిన కేంద్రం ఎట్టకేలకు వచ్చే నెల నుంచి సుంకాన్ని ఎత్తివేసేందుకు అంగీకరించింది. సాధారణంగా మన దేశం ఉల్లిగడ్డలను ఎక్కువగా చైనా, పాకిస్థాన్‌లకు ఎగుమతి చేస్తారు. అయితే ఈ ఎగుమతి సుంకం కారణంగా ఉల్లిని మన రైతులు అనుకున్నంత ఎక్కువ ఎగుమతి చేయలేక పోయారు.

రైతుల ఆందోళనకు తలొగ్గి..

ఉల్లిపై ఎగుమతుల సుంకంపై రైతుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన రైతులు గిట్టుబాటు ధర లభించక విలవిల్లాడారు. ఈసారి పంట పుష్కలంగా లభించినా ఎగుమతి ఆంక్షల కారణంగా ధర రాక నష్టపోతున్నామని, ఎగుమతి సుంకాలను పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 20 శాతం సుంకం ఎత్తివేయాలని ఉల్లి రైతులు గత నెల రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉల్లి ఎగుమతులు 17.17 లక్షల టన్నులు ఉండగా, 24-25 మార్చి వరకు అది కేవలం 11.65 లక్షల టన్నులు మాత్రమే ఉందన్నా రు. సుడాన్, టర్కీ, పాకిస్థాన్, ఇరాన్, ఈజిప్ట్, హాలెండ్ దేశాలు మన మార్కెట్లలో చొరబడ్డాయని మహారాష్ట్ర ఆనియన్ గ్రోయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భరత్ డిగోల్ పేర్కొన్నారు.దీంతో కేంద్ర ప్రభుత్వం20 శాతం ఎగుమతి సుంకాన్ని ఏప్రిల్ 1 నుంచి తొలగిస్తున్నట్టు ఇటీవల ప్రకటించింది.

జూన్ నుంచి ఏటీఎం ద్వారా

పీఎఫ్ విత్‌డ్రా!

- యూపీఐ ద్వారానూ విత్‌డ్రాకు అవకాశం
- కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి సుమితా దావ్రా

న్యూఢిల్లీ, మార్చి 25: ఉద్యోగులు, కార్మికులకు ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) శుభవార్త తెలిపింది. ఏటీఎం, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్(యూపీఐ) ద్వారా డబ్బును విత్‌డ్రా చేసుకునే విధానాన్ని ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ సందర్భంగా కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ కార్యదర్శి సుమితా దావ్రా మాట్లాడుతూ ఈ ఏడాది మే లేదా జూన్ నెలాఖరు నుంచి యూపీఐ, ఏటీఎంల ద్వారా ఉద్యోగులు తమ పీఎఫ్ సొమ్మును నేరుగా విత్‌డ్రా చేసుకోవచ్చునని తెలిపారు. మన బ్యాంకు ఖాతాలో నుంచి తీసుకున్న మాదిరిగానే పీఎఫ్ ఖాతా నుంచి కూడా నేరుగా డబ్బులు ఏటీఎం కేంద్రాలతో పాటు గూగుల్ పే, ఫోన్‌పే లాంటి యూపీఐ యాప్‌ల ద్వారా డబ్బు డ్రా చేసుకోవచ్చు. లక్ష రూపాయల వరకు వెంటనే విత్‌డ్రా లేదా తాము కోరుకున్న బ్యాంక్ ఖాతాలకు బదిలీ చేసుకోవచ్చునని సుమితా దవ్రా వివరించారు.

ఆ జడ్జీ మాకొద్దు

- అలహాబాద్ హైకోర్టు న్యాయవాదుల నిరవధిక సమ్మె

ప్రయాగ్‌రాజ్, మార్చి 25: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను రాష్ట్ర హైకోర్టుకు బదిలీ చేయాలన్న ప్రతిపాదనను నిరసిస్తూ అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు మంగళవారం నిరవధిక సమ్మె ప్రారంభించారు. నిరసనకు నాయకత్వం వహించిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ మాట్లాడుతూ ఈ నిరసన ఏ న్యాయస్థానానికో లేక న్యాయమూర్తికో వ్యతిరేకంగా చేస్తున్నది కాదని చెప్పారు.

కమిటీ విచారణ ప్రారంభం

జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నగదు లభించిన ఘటనపై విచారణ నిమిత్తం ఏర్పాటైన ముగ్గురు సభ్యులతో కూడిన అంతర్గత కమిటీ తన విచారణను ప్రారంభించినట్టు న్యాయ వర్గాలు తెలిపాయి.

అమెరికాలో ఏపీ యువకుడి

అనుమానాస్పద మృతి

టెక్సాస్, మార్చి 25: అమెరికాలో తెలుగు యువకుడొకరు అనుమానాస్పద స్థితిలో మరణించాడు. అతను అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిన ఒక రోజు తర్వాత అనుమానాస్పద స్థితిలో శవమై కన్పించాడు. ఏపీలోని కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన కొల్లి అభిషేక్. భార్యతో ప్రిన్స్‌టన్‌లో నివసిస్తున్నాడు. అయితే శనివారం ఆయన అదృశ్యం కాగా, మరునాడు ఆయన మృతదేహం టెక్సాస్‌లో దొరికింది. అభిషేక్ ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. అభిషేక్ గత ఆరు నెలలుగా ఉద్యోగం లేక బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని ఆయన సోదరుడు తెలిపాడు. దీంతో అతని మృతదేహాన్ని భారత్‌కు పంపడానికి గోఫండ్ మీ క్యాంపెయిన్ ద్వారా నిధులు సేకరించారు.

ముగ్గురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్

- మృతుల్లో వరంగల్‌కు చెందిన సుధీర్
- అతడిపై 25 లక్షల రివార్డు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 25: భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతేవాడ-బీజాపూర్ సరిహద్దుల్లో మంగళవారం చోటు చేసుకుంది. దంతేవాడ జిల్లా సరిహద్దు గీదమ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గ్రామాల్లో ఇరువర్గాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అక్కడి నుంచి పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని జల్లెడపట్టారు. అనంతరం తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలుచేపట్టారు. మృతులలో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు(డీకేఎస్‌జడ్‌ఎం) సుధీర్ అలియాస్ సుధాకర్ అలియాస్ మురళితోపాటు ఎస్‌జడ్‌ఎంలు మన్ను బార్సా, పండరూ అతర్ ఉన్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. సుధాకర్ వరంగల్ ప్రాంత వాసిగా పోలీసులు గుర్తించారు. ఇతడిపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది.

త్వరలో కొత్త మీడియా కౌన్సిల్

- మీడియా క్రమబద్ధీకరణకు కేంద్ర ప్రభుత్వం యోచన
- ఒకే గొడుగు కిందకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా

న్యూఢిల్లీ: ముద్రణ, ప్రసార, డిజిటల్ మీడియాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు చేర్చేందుకు కొత్తగా మీడియా కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని పార్లమెంటరీ కమిటీ ఒకటి కేంద్రానికి సిఫారసు చేసింది. మీడియా నియంత్రణను క్రమబద్ధీకరించడం, సాంకేతిక పురోగతి, మీడియా కలయికల ద్వారా ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవడం లక్ష్యంగా ఈ ప్రతిపాదన చేసింది. ప్రస్తుతం దేశంలో డిజిటల్ వేదికలు, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా భారీ సంఖ్యలో పుట్టుకొచ్చాయి. దీంతో వీటిని నియంత్రించడం సంక్లిష్టంగా మారింది. ప్రస్తుతం డిజిటల్ వేదికలు ఐటీ చట్టం, 2021 కింద ఉండగా ప్రింట్ మీడియాను ప్రెస్ కౌన్సిల్ నియంత్రిస్తున్నది. టీవీ చానళ్లు కేబుల్ టీవీ నెట్‌వర్క్ చట్టంలోని మార్గదర్శకాల ప్రకారం నడుస్తున్నాయి. మీడియా కౌన్సిల్ వీటన్నింటిని ఒకే గొడుగు కిందకు తీసుకొస్తుంది.

నకిలీకి కేరాఫ్ బీజేపీ

- అసత్య వార్తల్ని ప్రచారం చేసే వాళ్లంతా కమలదళమే
- పార్టీ నేతలు, సానుభూతి పరులు ఇలా అందరూ వాళ్లే
- నెటిజన్ ప్రశ్నకు 'గ్రోక్' చాట్‌బాట్ వివరణాత్మక జవాబు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' బయటపెడుతున్న నిజాలు ప్రధాని మోదీ సహా బీజేపీ నాయకులందరికీ ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. బీజేపీ పరివారం ఇంతకాలం సాగించిన అసత్యాల బాగోతాన్ని ఈ చాట్‌బాట్ ఆధారాలతో సహా తుత్తునియలు చేస్తున్నది. ఈ క్రమంలో 'ఎక్స్' వేదికగా అసత్య వార్తలను ప్రచారం చేస్తున్న టాప్-10 ఇండియన్ ఇన్‌ఫ్లూయెన్సర్లు జాబితాను విడుదల చేయాలంటూ 'గ్రోక్'ను అఖిలేశ్ మౌర్య అనే ఓ నెటిజన్ కోరారు. 'ఫ్యాక్ట్-చెకింగ్ డాటా మార్చి-2025' ప్రకారం గ్రోక్ విడుదల చేసిన ఈ జాబితాలోని అందరూ దాదాపుగా బీజేపీ నేతలు లేదా ఆ పార్టీ సానుభూతిపరులు కావడం గమనార్హం.

అసత్య వార్తలు ప్రచారం చేస్తున్న టాప్-10 ఇండియన్ ఇన్‌ఫ్లూయెన్సర్లు

నుపుర్ శర్మ

గతంలో బీజేపీ ప్రతినిధిగా విధులు నిర్వహించారు. ఓ టీవీ ఛానెల్‌లో జరిగిన డిబేట్‌లో మహమ్మద్ ప్రవక్తపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో బీజేపీ ఆమెను పార్టీ నుంచి బహిష్కరించింది. ఆమె ఇప్పటికీ బీజేపీకి సానుభూతిపరురాలిగా కొనసాగుతున్నారు.

రాహుల్ రోషన్

ఓపీఇండియా వెబ్‌సైట్‌కు సహ వ్యవస్థాపకుడు. బీజేపీకి అనుకూలంగా ఈ వెబ్‌సైట్ వార్తలను ప్రచురిస్తుందనే ఆరోపణలున్నాయి. 2020 ఢిల్లీ అలర్లు, కొవిడ్ వ్యాప్తికి సంబంధించి రాహుల్ తన ఎక్స్ ఖాతాలో వెరిఫై చేసుకోకుండా పోస్టులు పెట్టడం వివాదమైంది.

అమిత్ మాలవీయ

బీజేపీ ఐటీ సెల్‌కు ఇంచార్జ్. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 2020లో రైతన్నలు సాగించిన ఉద్యమాన్ని నిర్వీర్యం చేయడానికి తప్పుడు వార్తలు ప్రసారం చేశారన్న ఆరోపణలున్నాయి. రైతు ఆందోళనను తప్పుదోవ పట్టించడానికి వీడియోలను మార్ఫింగ్ చేసినట్టు వార్తలొచ్చాయి.

అర్ణబ్ గోస్వామి

అర్ణబ్ గోస్వామి రిపబ్లిక్ టీవీ ఎండీగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా ఈయన చర్చా కార్యక్రమాలు బీజేపీకి అనుకూలంగా ఉంటాయి. బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మృతి కేసులో తప్పుడు కథనాలను ప్రసారం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

కంగనా అండ్ టీమ్

కంగన బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ. 2020-21 రైతుల ఉద్యమం, 2024లో బంగ్లాదేశ్‌లో జరిగిన అల్లర్లు, కొవిడ్-19, భారత స్వాతంత్ర్య పోరాటం ఇలా పలు అంశాలపై తప్పుడు వార్తల్ని ప్రచారాన్ని చేశారంటూ ఆరోపణలున్నాయి.

వివేక్ అగ్నిహోత్రి

దర్శకుడు. బీజేపీ సానుభూతిపరుడు. కశ్మీర్‌పై బీబీసీ సర్వేను మార్ఫింగ్ చేశారని ఆరోపణలున్నాయి. నకిలీవార్తలు ప్రచారం చేస్తున్న వ్యక్తిగా పేర్కొన్నందుకు అగ్నిహోత్రికి తాను క్షమాపణ చెప్పినట్టు జరుగుతున్న ప్రచారం తప్పేనని 'గ్రోక్' తేల్చిచెప్పింది.

షెహజాద్

బీజేపీ జాతీయ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడానికి అమెరికా 21 మిలియన్ డాలర్లు ఖర్చు చేసిందంటూ తప్పుడు వార్తలు ప్రచారం చేశారు.

కపిల్ శర్మ

ఢిల్లీ బీజేపీ మంత్రి. 2020 ఢిల్లీ అల్లర్లకు సంబంధించి తప్పుడు కథనాలు వ్యాప్తి చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. 2020 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను 'ఇండియా వర్సెస్ పాకిస్థాన్'గా అభివర్ణిస్తూ ఆప్‌ను టార్గెట్ చేయడం వివాదానికి దారితీసింది.

సురేశ్ చావాంకే

బీజేపీ అనుకూల మీడియా సుదర్శన్ టీవీ సీఎండీ. 2020లో 'యూపీఎస్సీ జీహాద్' పేరిట ఒక వర్గాన్ని టార్గెట్ చేస్తూ ప్రోగ్రామ్‌ను ప్రసారం చేశారు. ఇది వివాదాస్పదమైంది. పలు నకిలీ వార్తలను ప్రచారం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

పుష్పేంద్రకుమ్

ఈయన ఓ క్రిప్టో ఇన్‌ఫ్లుయెన్సర్. బిట్‌కాయిన్‌కు సంబంధించి తప్పుడు వార్తలు ప్రసారం చేస్తారన్న ఆరోపణలు ఉన్నాయి.

చేయని నేరానికి 55 ఏండ్ల జైలు!

12 కోట్ల నష్ట పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశం

టోక్యో, మార్చి 25: మరణశిక్షపై 55 ఏళ్లకు పైగా జైలు జీవితాన్ని గడిపి గత ఏడాది నిర్దోషిగా విడుదలైన ఓ జపాను వృద్ధుడికి 14 లక్షల డాలర్ల(దాదాపు రూ.12 కోట్లు) నష్ట పరిహారాన్ని న్యాయస్థానం ప్రకటించింది. తప్పుడు కేసులో అత్యంత సుదీర్ఘ కాలం జైలు జీవితాన్ని గడిపినందుకు రోజుకు 85 డాలర్లను (దాదాపు రూ.12,300) చొప్పున నష్ట పరిహారంగా అందచేయాలని షిజువోకా జిల్లా కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. మాజీ ప్రొఫెషనల్ బాక్సర్ అయిన 89 ఏళ్ల ఇవావో హకమాటా 1968లో నలుగురు వ్యక్తుల హత్యకు సంబంధించిన కేసులో అరెస్టయ్యారు. అతనికి న్యాయస్థానం మరణశిక్ష విధించింది. మృతుల వద్ద లభించిన రక్తపు మరకలు ఉన్న బట్టలను ప్రధాన సాక్ష్యంగా పరిగణించిన కోర్టు హకమాటాకు మరణశిక్ష విధించింది. అయితే ఈ బట్టలను డీఎన్ఏ పరీక్షకు పంపగా వాటిని మృతదేహాల వద్ద పోలీసులే ఉంచారని బయటపడింది. దీంతో హకమాటా మరణశిక్షను కోర్టు రద్దు చేసింది. తప్పుడు కేసులో మరణశిక్షను ఎదుర్కొని అత్యంత సుదీర్ఘకాలం జైలు జీవితాన్ని గడిపిన తొలి వ్యక్తిగా హకమాటా జపాను చరిత్రలో నిలిచిపోయారు. ఆయనకు కోర్టు ప్రకటించిన నష్టపరిహారం అతి పెద్ద మొత్తమని, అయితే ఆయన కోల్పోయిన జీవితాన్ని ఏదీ భర్తీ చేయలేదని హకమాటా తరపు న్యాయవాది హిడెయో ఓగావా వర్ణించారు. 1961లో ప్రొఫెషనల్ బాక్సర్‌గా రిటైర్ అయిన హకమాటాకు సెంట్రల్ జపాన్‌లోని షిజువోకాలోని సోయాబీన్ ప్రాసెసింగ్ ప్లాంట్‌లో ఉద్యోగం లభించింది. రెండేళ్ల తర్వాత ఆయన యజమాని, యజమాని భార్య, వారి ఇద్దరు పిల్లలు వారి ఇంట్లో కత్తిపోట్లకు గురై మరణించారు. తన చేత పోలీసులే బలవంతంగా నేరాన్ని ఒప్పించారని ఇవావో హకమాటా వాదించాడు.

ప్రాణం కన్నా పుస్తకాలే మిన్న!

- *బుల్డోజర్లతో గుడిసెలు కూల్చివేత*
- *ప్రమాదవశాత్తూ మంటలు*
- *పుస్తకాలను కాపాడుకునేందుకు ప్రాణాలు లెక్కచేయక బాలిక పరుగులు*
- *బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో ఘటన*
- *బేటీ బచావో బేటీ పడావో ఇదేనా?*
- *బీజేపీ సర్కారుపై అఖిలేశ్ ఫైర్*

లక్నో, మార్చి 25: తగలబడిపోతున్న గుడిసెలో చిక్కుకున్న హీరోయిన్‌ను కాపాడేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయని హీరోలను మనం సినిమాల్లో చూస్తుంటాం. అయితే ఓ ఏడేళ్ల బాలిక చేసిన సాహసం మాత్రం ఎవరూ ఊహించనిది, అనితర సాధ్యమైనది. పక్కింటి గుడిసె కాలిపోతుండగా కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న తన గుడిసెలో ఉన్న పాఠ్యపుస్తకాలను తెచ్చుకునేందుకు ఆ బాలిక చూపిన సాహసం సోషల్ మీడియా యూజర్లను విస్మయానికి గురిచేసింది. చదువు పట్ల ఆ పేద బాలికకున్న నిబద్ధతను చూసి నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్ జిల్లాలో ఇటీవల జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

అసలేం జరిగింది?

అక్రమ నిర్మాణాల పేరుతో అంబేద్కర్ నగర్‌లోని అరై గ్రామంలో యోగి సర్కారు పేదలకు చెందిన గుడిసెలను బుల్డోజర్లతో కూల్చివేయడం మొదలుపెట్టింది. ఈ క్రమంలో గుడిసెకు మంటలు అంటుకోగా వాటిని ఆర్పేందుకు అధికారులు ప్రయత్నిస్తుండగా దాన్ని ఆనుకునే ఉన్న మరో గుడిసెలోకి అనన్య అనే ఏడేళ్ల బాలిక పరుగులు పెట్టి తన పుస్తకాలు ఉన్న స్కూలు బ్యాగును తెచ్చుకున్నది. తాను వెళ్లి తెచ్చుకోకపోతే తన పుస్తకాలు కూడా కాలిపోతాయని, తన చదువు ఆగిపోతుందని ఆ బాలిక ఆవేదక వ్యక్తంచేసింది. ఎస్పీఅధ్యక్షుడు, అఖిలేశ్ యాదవ్ ఈ వీడియోను షేర్ చేస్తూ బేటీ బచావో, బేటీ పడావో అంటే ఇదేనా అని విమర్శించారు.

పాస్‌పోర్టు మరచిన పైలట్..

విమానం యూటర్న్

లాస్‌ఏంజెల్స్, మార్చి 25: ఒక పైలట్ పాస్‌పోర్టును మర్చిపోవడంతో విమానం తిరిగి వచ్చిన ఘటన అమెరికాలో చోటుచేసుకుంది. లాస్‌ఏంజెల్స్ నుంచి చైనాకు యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన యూఏ 198 విమానం 257 మంది ప్రయాణికులు, 13 మంది సిబ్బందితో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరింది. అయితే షాంఘైకి ఆరు గంటల్లో చేరుకుంటారనగా, తాను పాస్‌పోర్ట్‌ను మర్చిపోయిన విషయం అందులోని ఒక పైలట్‌కు గుర్తుకు రావడంతో వేరే గత్యంతరం లేక విమానం యూటర్న్ తీసుకుంది. దానిని మధ్యాహ్నం 5 గంటలకు శాన్ ఫ్రాన్సిస్కో ఎయిర్‌పోర్టులో దించారు. తర్వాత కొత్త సిబ్బందితో రాత్రి 9 గంటలకు బయలుదేరిన విమానం ఆరు గంటలు ఆలస్యంగా షాంఘైకు చేరుకుంది. ఇది సిబ్బంది క్రమశిక్షణా రాహిత్యానికి నిదర్శనమని, ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని పలువురు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.